# దేవుడు మెచ్చే మొక్కు

-కారంపూడి వెంకటరామదాస్

"హౌరా నుండి తిరుపతి వెళ్ళు రేణిగుంట ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిముషాల్లో రెండోనెంబర్ ప్లాట్‌ఫాం మీదికి వచ్చును" అన్న అనౌన్స్‌మెంట్ విన్న తర్వాత శ్రీధర్‌కి చిన్న టెన్షన్ మొదలైంది. ఇది అర్ధం లేని టెన్షనని తెలిసినా అధికమైన గుండె మ్రోతని ఆపుకోలేకపోయాడు.

ఏసీ త్రీటైర్ కన్‌ఫార్మ్‌డ్ రిజర్వేషన్ టిక్కెట్లు చేతిలో పెట్టుకుని మరీ ఈ టెన్షన్ దేనికి? అని మనసులో అనుకున్నాడు. కానీ ఈసామాన్లతో పాటూ పిల్లల్ని ఆగే ఆకొద్ది నిముషాల్లో ట్రైన్ ఎక్కించాలి? తీరా ఎక్కాకా తమ సీట్లు ఖాళీగా ఉంటాయో, లేక ఎవరైనా ఆక్కుపై చేస్తే వారితో వాదించి తమ సీట్లు దక్కించుకోవాలేమో? లాంటి అనవసరపు ఆలోచనలే ఆ గుండెమ్రోతకి అసలు కారణం. పక్కనే కూల్‌గా ఎంజాయ్ మూడ్‌లో ఉన్న భార్యాపిల్లల్ని చూస్తే కాసింత ఆశ్చర్యం వేసింది. ఏ టెన్షన్ లేకుండా జాలీగా ఉన్నారు. అవును వారికెందుకూ టెన్షన్? బాధ్యతంతా తనదైతే! అనుకున్నాడు.

మొత్తానికి ట్రైన్ రావడం, ఎదుటివారిని తోసుకుంటూ శ్రీధర్ ఫేమ్లీ హడావుడిగా ఎక్కేయడం ఆటోమేటిక్‌గా జరిగిపోయింది. తమ బెర్తులు ఖాళీగానే ఉండడంతో మనసులోనే 'హమ్మయ్య!' అనుకున్నాడు శ్రీధర్.

"మన బెర్తు నెంబర్లు ఎంతండీ?" సందేహంగా అడిగింది శ్రీలత భర్తతో.

"పది, పదకొండు, పన్నెండూ..." జవాబిచ్చాడు శ్రీధర్. బెర్తు నెంబర్లని చెక్ చేసుకుని సరిగ్గానే కూర్చున్నామని అనుకుంది శ్రీలత.

చిన్నది ఐదులోపుది కావడంతో భార్యకి, కొడుక్కీ, తనకి మొత్తం మూడు టిక్కెట్లు తీసుకున్నాడు శ్రీధర్. లోయర్‌బెర్తు మొత్తంవారి ఆధీనంలోకి వచ్చింది. సామానులన్నీ బెర్తుకింద సర్ది వెయ్యవలసిన వాటికి చైన్‌తో లాక్ చేశాకా హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. అప్పుడు ఈలోకంలోకి వచ్చి భార్యా, పిల్లలతో ప్రయాణ ఆనందాన్ని ఆరంభించాడు.

ఎదుటబెర్తులో నలభైయో పడిలో ఉన్న ఓ వ్యక్తితో పాటూ డెబ్భైకి దగ్గరలో ఉన్న ఓ పెద్దామె ప్రయాణిస్తున్నారు. ఆమె అన్నివిధాలా ఆ వ్యక్తిపై ఆధారపడి ప్రయాణిస్తున్నదని ఎవరైనా ఇట్టే కనిపెట్టేయ్యొచ్చు. వారిని చూడగానే ఎవరైనా తల్లీకొడుకులని కూడా ఊహిస్తారు.

పిల్లలు వారి సందడిలో వాళ్ళున్నారు. శ్రీలత ఎదుట ప్రయాణికుల వైపు ఆసక్తిగా చూస్తోంది. శ్రీధర్ మటుకు తారసపడ్డ ఆ తోటి ప్రయాణికుల్ని చూసి కాసింత నిరాశపడ్డ మాట వాస్తవం.

అసలే ఏసీ కోచ్! బైట పరిసరాలేవీ కనిపించడం లేదు. వేరే కాలక్షేపం లేకపోవడంతో దిక్కులు చూస్తూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. శ్రీలత ఎదుట పెద్దామెని గమనిస్తోంది. శ్రీధర్ ఎదుట ఉన్న ఆ ఇద్దరిని చూడకుండా ఉండేందుకు వీలైనంత వరకూ ప్రయత్నిస్తున్నాడు.

"రఘూ! చాలా చల్లగా ఉంది!" అందా పెద్దామె ఇక చలికి తట్టుకోలేక.

రఘు వెంటనే లేచి రైల్వేవారు సప్లై చేసే రగ్గుని మడతవిప్పి ఆమె చుట్టూ కప్పి ఆమెకి వెచ్చదనాన్ని కల్పించాడు. పెద్దామె మాటల్ని బట్టి ఆమె కొడుకు పేరు రఘు అన్నమాట అని మనసులో అనుకున్నాడు శ్రీధర్.

"టీ...కాఫీ..." అంటూ లయబద్ధంగా కేకలేసుకుంటూ పోతున్న కేటరర్‌ని ఆపాడు రఘు. వెంటనే పెద్దామెతో-

"అమ్మా! కాఫీ కావాలా? టీ కావాలా?"

"కాఫీ...." అంటూ మెల్లగా జవాబిచ్చిందామె.

ఓ కప్పు కాఫీతో పాటు మరో ఖాళీ కప్పు కూడా తీసుకున్నాడు. కాఫీని ఆ ఖాళీ కప్పులో సగం పోసి చల్లార్చి తాగేపాళంగా చేసి మరీ ఆమెకి అందించాడు. వేడి వేడిగా గొంతులో దిగిన కాఫీ ఆమెకి చక్కని రిలీఫ్ ఇచ్చినట్టుంది.

శ్రీలత వారి చర్యని ఓ కంట చూస్తూనే ఉంది. అయితే శ్రీధర్ ఇదేమీ పట్టించుకోకుండా వేరే ఆలోచనల్లో ఉన్నాడు. రేపు తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శనం ఎలా జరుగుతుందో? ఏ అసౌకర్యంలేకుండా జరగాలన్నదే అతడి ఆరాటం.

కాసేపయ్యాకా పెద్దామె, రఘుతో ఏదో మెల్లగా అంది. అది అర్థం చేసుకుని రఘు ఆమెని చెయ్యిపట్టుకుని మెల్లగా లేవనెత్తి టాయిలెట్స్ వైపు తీసుకుని వెళ్ళాడు. తిరిగి చెయ్యి పట్టుకుని తమ బెర్తు వద్దకి ఆమెని మెల్లగా తీసుకుని వచ్చి కూర్చోబెట్టాడు. ఆమెకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటున్నాడు రఘు. ఆ ఇద్దర్నీ శ్రీలతే కాక శ్రీధర్ కూడా గమనిస్తున్నాడు. శ్రీలతకైతే వారిని చూస్తే ముచ్చటేసింది. తల్లి పట్ల ఆ వ్యక్తికెంత శ్రద్ధ, ప్రేమా! అని మనసులోనే అనుకుంది. భర్తకేసి చూసింది. శ్రీధర్ తటాలున తల పక్కకి తిప్పుకున్నాడు. తన భర్త ఎందుకలా చూపు మరల్చాడో శ్రీలతకి తెలుసు. తన భార్యయ చూపులకి అర్థమేమిటో శ్రీధర్‌కి అర్థమైంది. అయినా ఏమీ ఎరగనట్టే ప్రవర్తించాడు. మరో అరగంట గడిచిందో లేదో పెద్దామెకి ఒక్కసారిగా దగ్గు మొదలైంది. ఆమె దగ్గుతో ఆయాసపడడం చూసి కంగారుపడుతూ రఘు బ్యాగ్‌లో నుండి ఏవేవో మందులు తీసి ఆమె చేత తినిపించి ఆమె వీపు నిమురుతూ ఊరట కలిగించాడు. ఇది చూసిన శ్రీలత కంగారుపడినా రఘు తీసుకున్న జాగ్రత్త చూసి స్థిమితపడింది. వారి అనుబంధాన్ని చూస్తూ శ్రీలత ఓ అనిర్వచనీయమైన అనుభూతికి లోనైంది.

ఇటు శ్రీధర్‌కి మరికాస్త ఇబ్బందిగా ఉంది. దానికితోడు భార్య మధ్యమధ్యలో తనవైపు చూసే నానార్థాల చూపులు...ఎందుకు ఆమె చూపుల్లో ఎక్కువ ఎత్తిపొడుపు భావమే గోచరించింది. ఏమైనా తన ఈస్థితికి అసలు కారణం వేరు. ఆ కారణం ఏమిటో తనకీ తెలుసూ. తన భార్యకీ తెలుసునని మనసులో అనుకుంటూ వారం రోజులు వెనక్కి వెళ్ళాడు.

* * *

"ఏమండీ! రాజమండ్రి నుండి అత్తగారు ఉత్తరం రాశారు" అంటూ కవర్‌ని అందించింది శ్రీలత. 'ఏమిటి చెప్మా' అనుకుంటూ కవర్ ఓపెన్ చేశాడు శ్రీధర్.

"చిరంజీవి శ్రీధర్‌కి!

ఆశీర్వాదాలు. ఇచ్చట నేను క్షేమం. మీరంతా బాగున్నారని తలుస్తాను. ఈమధ్య నా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంటోంది. ఎప్పుడో మీ చిన్నప్పుడు మనమంతా కలిసి ఆ శ్రీవారి దర్శనానికి తిరుమల వెళ్ళాం. ఆ తర్వాత నేటివరకూ మళ్లీ తిరుమలేశ్వరుని దర్శనభాగ్యానికి నేను నోచుకోలేదు. ఆ ఏడుకొండలవాడిని ఒక్కసారి చూడాలన్న కోరిక ఎందుకో కలుగుతోంది. నీకు వీలైనంత త్వరలో వచ్చి నన్ను శ్రీవారి దర్శనానికి తీసుకుని వెళ్ళు. ఏ విషయమూ నాకు జవాబు రాయి. కోడలిని అడిగినట్లు చెప్పవలెను. మనవడూ-మనవరాలికి నా ముద్దులు. అందరికీ నా దీవెనలు.

ఇట్లు మీ
-అమ్మ"

ఉత్తరాన్ని చదివిన శ్రీధర్‌కి చిన్న దిగులులాంటిది కలిగింది. అమ్మ నుండి ఈ ఉత్తరం సరిగ్గా ఇప్పుడే రావాలా? అయినా ఇది యాదృచ్ఛికమా? లేక అమ్మకి అసలు విషయం తెలిసీ ఈ ఉత్తరం రాసిందా? లాంటి ప్రశ్నలు శ్రీధర్ని దొలిచేస్తున్నాయి. శ్రీధర్ ఆందోళనకి అసలు కారణం మరో వారంలో సతీసమేతంగా శ్రీవారి దర్శనానికి



తిరుమల వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నాడు. రిజర్వేషన్లూ అన్నీ పూర్తయ్యాయి కూడా. ఈతరుణంలో తల్లినుండి తిరుమలేశ్వరుడ్ని చూడాలనుందని ఈ ఉత్తరం. ఈరోజుల్లో శ్రీవారి దర్శనం అంత సుళువుకాదూ! అందునా ముసలి వారితో..! అదీ శ్రీధర్ కలతకి అసలు కారణం.

"ఏవండీ! ఏం రాశారండీ..అత్తగారూ!" అడిగింది శ్రీలత.

"ఆ...ఏముంది...మా అమ్మకి తిరుమలకి వెళ్లాలనుందట. నన్ను తీసుకుని వెళ్లమంటూ ఈ ఉత్తరం...." నిట్టూరుస్తూ అన్నాడు శ్రీధర్.

"సంతోషపడవలసిన విషయమే కదండీ....ఎలాగో మరో వారంలో మనం వెళ్లబోతున్నాంగా. అత్తగార్ని కూడా తీసుకుని వెళ్దాం. ఇందులో ఆందోళన పడవలసింది ఏముంది?" సంబరంగా అంది లత.

"నీకేం...ఏదైనా చెబుతావు...ఈ వయసులో అమ్మని ఆ ఏడుకొండలెక్కిం చడం అంటే మాటలా... నానా ఇబ్బంది పడాలి. ఇక మనం తిరుమల వెళ్ళా మనే ఆనందం హుళక్కే... ఇది నాతో జరిగే పనికాదు...ఇప్పట్లో నాకు కుదర దని, తరువాత చూద్దామని రాసేస్తాను"

"బాగుండండీ.. మరో వారంలో దేవుడి దర్శనానికి ప్రయాణం కాబోతూ ఏంటండీ.. ఇది!"

"నీకేం తెలీదు. ఈ విషయంలో నీ సలహా అనవసరం" అన్నాడు శ్రీధర్. శ్రీలత మనసైతే భర్త నిర్ణయానికి బాధపడుతూనే ఉంది.

* * *

"ఏంటండీ ఆలోచిస్తున్నారు?" అంటూ శ్రీలత వేసిన ప్రశ్నకి తన ఊహల్ని కట్టిపెట్టాడు శ్రీధర్.

"ఏవండీ...చూశారా? ఆ ఇద్దరూ బహుశా తిరుమలకే వెళ్తున్నట్టున్నారు" మెల్లగా కదిపింది భర్తని.

"ఆ....ఆ...అయితే ఏంటి?"కంగారుని కప్పిపుచ్చుకుందామని ప్రయ త్నించి విఫలమయ్యాడు శ్రీధర్.

"అదేనండీ...అత్తగార్ని తీసుకొచ్చుంటే బాగుండేది" మనసులో ముక్కని కక్కేసింది శ్రీలత.

శ్రీధర్ మౌనంగా ఉండిపోయాడు.

"ఎక్కడివరకూ ప్రయాణం?" మాటలు కలిపింది శ్రీలత పెద్దామెతో.

"తిరుపతి...ఆ తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి..." ఆ దేవుడి దర్శనం భాగ్యం కలగబోతున్న ఆనందం ఆమె మొహంలో కనబడుతోంది.

"బామ్మగారూ... ఏదైనా మొక్కుందా తీర్చుకోవడానికి?"

"మొక్కు నాది కాదు, రఘుది"

"ఓహో...మీ అబ్బాయి మొక్కా?"

"రఘు నా కొడుకు కాదు"

ఈ సమాధానం విన్న శ్రీలతతో పాటూ శ్రీధర్ కూడా అదిరిపడ్డాడు.

"ఇతను... మీ అబ్బాయి కాదా?" అయితే ఎవరు? అన్న భావమే శ్రీలత ప్రశ్నలో ఎక్కువగా ధ్వనించింది.

"మొన్నటివరకూ ఇతడో అపరిచితుడు. నేడు ఆప్తుడు!" క్లుప్తంగా చెప్పిందా పెద్దామె.

"ఇంతకీ మీ మొక్కేమిటి?"రఘుతో అన్నాడు శ్రీధర్ కూడా మాటలు కలు పుతూ. రఘు చిరునవ్వు నవ్వాడు.

"ఊ... మొక్కే! నాదో వింతైన మొక్కు. నాకేదైనా మంచి జరిగినా...లేదా జరగాలనుకున్నా నేనా శ్రీనివాసుడిని మొక్కుకుంటాను. కానీ అందరిలా తలనీ లాలిస్తాననో...నిలువుదోపిడీ ఇచ్చుకుంటాననో లేదా తులాభారం వేస్తాననో లాంటివి కావు. నా మొక్కల్లా శ్రీనివాసుడి భక్తులైన ఓ పేద, వయసుడికిన వృద్ధుడ్నో, వృద్ధురాల్నో ఆ ఏడుకొండలవాడి దగ్గరికి నా సొంత బాధ్యతపైన తీసుకొస్తానని! అందులో భాగమే ఈ ప్రయాణం..."

ఇది విని శ్రీధర్ షాక్ తిన్నాడు.

ఇప్పటివరకూ తాను విన్న మొక్కుల్లోకెల్లా చాలా గొప్పదీ, బహుశా ఆ శ్రీని వాసుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మొక్కు ఇదేనేమోనని మనసులో అను కుంది శ్రీలత. శ్రీధర్‌లో అంతర్మథనం ఆరంభమైంది. ముక్కూ మొహం తెలీని ఓ వృద్ధురాల్ని అంత ఆప్యాయతా, అనురాగాలతో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఆ వ్యక్తి తీసుకెళ్తుంటే తానో? నోరు తెరిచి అడిగిన కన్నతల్లి కోరిక తన ఆనందానికి అడ్డుగోడగా భావించి నిరాకరించాడు. తననా ఏడుకొండలవాడు క్షమిస్తాడా? బాగా ఆలోచించాడు. ట్రైన్ రాజమండ్రి చేరుకుంది.

ప్రయాణం మధ్యలో ట్రైన్ దిగిన పిల్లలకి ఏమీ అర్థంకాలేదు. అయితే శ్రీల తకి విషయం బాగా అర్థమైంది.

"పిల్లలూ! నాయనమ్మని తీసుకుని మనం మళ్ళీ ప్రయాణం కొనసా గిస్తాం!" అంది శ్రీలత పిల్లల సందేహాన్ని తీరుస్తూ.

"నాయనమ్మతోనా...భలే, భలే!" ఆనందంగా అన్నారా పసివాళ్ళు.

★

## ప్రఖ్యాత వ్యక్తులు

చరిత్ర ప్రసిద్ధికెక్కిన నెపోలియన్ పాత్ర ఇప్పటికి 194 సినిమాల్లో కని పిస్తే, జీసస్ క్రీస్తు పాత్ర 152 సినిమాల్లోనూ, అబ్రహాం లింకన్ పాత్ర 137 సినిమాల్లోనూ కనిపించిందిట!



## పోలీసులకు ఏరోబిక్స్

పోలీస్ ఫోర్సులో 'బొజ్జ'ల సమస్య ఇప్పుడు విపరీతంగా ఉన్న నేప థ్యంలో నేషనల్ పోలీస్ అకాడమీ వారు ఐపిఎస్‌లో చేరిన వెంటనే యువ ఆఫీసర్లకి స్పెషల్ ఫిజికల్ ట్రైనింగ్ ఇస్తున్నారుట. పై ఆఫీసర్లు స్మార్ట్‌గా ఉంటేగానీ తమ క్రింద పని చేసే కానిస్టేబుల్స్‌ని కంట్రోల్ చేయలేరని రోజుకి గంటన్నరసేపు ఏరోబిక్స్ క్లాసులు తీసుకుంటున్నారుట!

## హాంకాంగ్‌లో పన్ను రాయితీలు

ఓపక్క చైనాలో కుటుంబానికో బిడ్డని మించి ఉంటే శిక్షలు వేస్తుండగా హాంకాంగ్‌లో ఎక్కువమంది పిల్లల్ని కంటే ఒక్కో అదనపు బిడ్డకి ఆదా యపు పన్ను పరిమితి నుంచి 50 వేల డాలర్లు తగ్గించుకోవచ్చునట. దేశంలో జనాభా తగ్గిపోతోందని భావించి ప్రభుత్వం ఈ రాయితీనిస్తోంది.

-తటవర్తి